కథానిక :

ఉద్యోగధర్మం

శ్రీ పంతఃల శ్రీరామశాస్త్రి

"అదికాదు సుశీలా! నేను చెప్పేది నువ్వు చివరంటా వినకుండానే ఏదో ఉపన్యాసం సాగిస్తున్నావు," అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ముందుగా నన్నడగడం దేనికి, తీరా ఏదో నాకు తోచినమాట చెప్తే, ఉపన్యాసం అనడం ఎందుకు? నా అంతట నేను మీ ఉద్యోగవిషయాలగురించి మాట్లాడేనా?"

"నువ్విలా మాట్లాడలేదనే నాకు విచారంగా ఉంది. మునుపు నువ్వు ఎంతో ఉత్సాహంగా అన్ని సంగతులూ చర్చిస్తూఉంటే, నాకు ఏ పని చేయడానికయినా ఎంతో సరదాగా ఉండేది. ఇప్పుడసలు నీకంటిల్లే నీ లోక మయిపోయింది."

"ఒక్కవంటింట్లోనే కదలకుండా కూర్చొని నేను సుఖపడిపోతున్నానేమో నని మీకు ఈర్ష్యగాఉంది కాబోలు; మీ ముగ్గురు పిల్లలకీ సంరక్షణ చేయడానికి ఈ ఇరవై నాలుగు కాదు, నలభైనాలుగు గంటలున్నా చాలవేమో— చిట్టిపిల్లని ఎత్తుకోందికి మనిషిని పెట్టకుండా, వంటమనిషి కావాలనకుండా, పెద్దపిల్లలకి ప్రైవేటు మాష్టరక్కర లేకుండా చదివించుకొని వస్తూంటే, ఇదంతా మీకు కనబడదు. ఏదో హాయిగా నాలుగుఊళ్ళూ తిరిగివచ్చి, ఈ స్కూలు బాగుండలేదు, అస్కూలులో మాష్టర్లు ఉన్నారుగాని పిల్లలులేరు, ఇంకొకస్కూలు అసలు కనబడనే కనబడదు అని రాయడమే కదూ మీరుపడే మహాకష్టము—"

"కష్టమో సుఖమో నాలుగురోజులు చేస్తే తెలిసిపోస్తాయి ఇందులో సాధక బాధకాలు"

"అదే నేనంటున్నదీని. ఏపనిలో ఉండే కష్టసుఖాలయినా తెలుసుకోవాలంటే, ఆ పని చెయ్యనయినా చెయ్యాలి, లేదా దానిమీద పూర్తిగా మనస్సుంచి ఊహించచనయినా ఊహించాలి. అలాక్కాకుండా నేనొక్కడినే తిప్ప తక్కినవాళ్ళెవ్వళ్ళూ సరిగ్గా పనిచేయలేదనుకోడం అందరికీ మామూలే. నేనూ ఇంట్లో ఊరికినే కూర్చున్నా ననుకోకండి."

"సరే, సరే, సరే, నిజమే, అయితేమాత్రం మన విధి అంటూ ఒకటిఉందన్న మాట మరిచిపోయి కాలక్షేపంచేసేవాళ్ళు లేరంటావా?"

"ఉంటే ఉండొచ్చు ఎక్కడో. కాని, అందరూ, ఎలాగోలాగు పని మానెయ్యాలని చూస్తారనే అనకోలేం. వాళ్ళ పరిస్థితులెలా ఉన్నాయో పాపం."

"ఇలా మనం చర్చపెట్టుకుంటే తేలేదేమిటి? నాకు అక్కడినించి తిరిగివచ్చిన దగ్గరనుంచీ ఈ వెంకటేశ్వర్లు స్కూలు సంగతే బుఱ్ఱని పట్టుకు పీడిస్తున్నది. మరీ డొంక తిరుగుడు లేకుండా నిసలుగా చెప్పి, ఎలాచేస్తే బాగుంటుందో"

"నేను మొదటినుంచీ నిసలుగానే చెప్తున్నాను. అసలు మీకీ సందర్భంలో అనుమానం ఎందుకొచ్చిందో నా కాశ్చర్యంగా ఉంది. మీరూ ఆయనా అప్పుడు అంతస్నేహంగా ఉండేవారు. ఆయన అప్పుడు కాంగ్రెసు హడావిడులో జైలులో పడబట్టి గాని, లేకపోతే ఆయనా ఈ సరికి ఏదోమంచి ఉద్యోగంలో ఉండి ఉండేవారు. అరోజుల్లో ఆయన్ని తలుచుకొని మీరెంత విచారించేవారు! మన పెళ్ళి అయిన కొత్తలో ఎంతోగొప్పగా చెప్పేవారు కదూ ఆయన తెలివితేటల గురించి—"

"అవంతా నిజమే కావచ్చును. అయితే మాత్రం మన ఉద్యోగధర్మాన్ని మనం నిర్వర్తించకపోడానిక వేవీ కారణాలు కాలేవు కదూ?

"అబ్బ, మహాగొప్ప ఉద్యోగధర్మమండీ, అంతా అక్షరాలా తు, చ తప్పకుండా జరిగిపోతున్నట్లు మాట్లాడతారు. పోనీ, ఒక్కరు మీలాంటివాళ్లు భయంచేతో మరోకారణంచేతో తమరు నమ్మినదే చేయవచ్చును. అంత మాత్రంలో తక్కినవాళ్లంతా అలాగే చేస్తున్నారా? ఎవడో పైవాడు పదీపాతిగా పుచ్చుకొని అతితేలికగా చేసేపనిని మీరు మీస్నేహితుడికి చెయ్యలేరా? ఇందులో మీకేం నష్టం లేదుకదా!"

"నష్టం అంటే రూపాయిలు అణాలు పైసలు వీటిలో లేకపోవచ్చును. కాని, అలాగని పూర్తిగా అబద్ధం రాయడానికి మనస్సు ఒప్పకోవద్దూ? స్నేహితుడుగా నన్ను ఎప్పటిలాగ 'ఒరే' అని చనవుగా పిలవడం, నన్నుహాస్యం చెయ్యడం, అవీ అక్కడ పల్లెటూరి ప్రజల ముందు అంతమంచిది కాదనకో,అయినా వాటికీ నేను ఏమీ పట్టించుకోవడంలేదు. అధమం ఆమనిషి, ఏదో సమాధానంగా ఇప్పటికి పొరపాటయిపోయింది, మళ్లీ మాటుకి అంతా తయారుగా ఉంటామన్న మాటయినా అంటే, కొంత బాధ లేకపోవును. అబ్బే, అసలు ఆమనిషికి స్కూలు అని ఒకటి ఉందనీ, దానిలో తను ప్రధానాధ్యాపకత్వం నిర్వహిస్తున్నాననీ అస్మృతే ఉన్నట్టులేదు. ఏమిటి చెయ్యడం"

"మీతక్కిన స్కూళ్లన్నీ మహా సవ్యంగా ఉన్నాయిటండీ? వాళ్ళయితే ఏదో మీకు వచ్చే తేదీ ముందుగానే తెలుసుకొని ఆవేళకి ఊళ్ళో పిల్లలని పోగుచేసుకొని, కూర్చుంటారు; మీకు నాలుగు పదుపాయాలూ చేసి, చిత్తం చిత్తం అంటూ వంగి వంగి నమస్కారాలు చేస్తారు. ఆయనా మీరూ కలిసి చదువుకొన్నారుగనక, అప్పట్లో అంత స్నేహంగా ఉండేవారుగనక అలాటివన్నీ మీకు అలవాటయినంతబాగా చేయ్యలేకపోయి ఉండొచ్చును. అంతమాత్రంలో..."

సుబ్రహ్మణ్యానికి ఈచివరి మాట కాస్త చురుక్కుమని తగిలింది.

"అంటేనీ ఉద్దేశం ఏమిటే? నాకు గౌరవ మర్యాదలు తక్కువ అయేయి గనక వాడిమీద కక్ష తీర్చుకోందికి ఇలా చేస్తున్నానని నీ ఉద్దేశమా?"

"నాకే ఉద్దేశమూ లేదు. అలా మాట్లాడుతూ ఉంటే ఏదో నోటికివచ్చిన మాటన్నాను."

ఇంత తేలికగా సుశీల మాట్లాడ్డం సుబ్రహ్మణ్యానికి బాగా చిరా కనిపించింది.

"మహా తెలివయిన పని చేసేవు కదూ. ఇప్పుడు మనస్సెలా ఉందో నీకేమయినా తెలిస్తేనా? ఒక వైపు నెలా అయీ సరికల్లా జీతం, భత్యం పుచ్చేసుకొంటున్నాము కదా' మనవిధి మనం సక్రమంగా నిర్వర్తించవద్దా అనే ఉద్యోగధర్మం, రెండవవైపు పాతస్నేహితుడు, అదీ అంత మంచి పరిస్థితులలో లేడు, వాడికి ఉపకారం చెయ్యడానికి బదులు అపకారం చెయ్యడమా అన్న సంకోచం ఇంకొకవైపూ ఏమీ ఒక నిశ్చయానికి రాబడకుండా ఉంది"

అప్పటికీ కొంత సర్దుబాటుగా సుశీలఅంది.

"ఇప్పుడదంతా మరిచిపోయి పడుక్కోండురూ, పదిన్నరయింది. హాయిగా నిద్రపోతే రేపుదయానికి మనస్సు దానంతటదే ఒక నిశ్చయానికి వస్తుంది."

"నీకు నిద్ర వస్తున్నాదని చెప్పకూడదూ నన్ను పడుకోమనకపోతే - నాకింకా మరొకగంట, గంటన్నరవరకూ నిద్రరాదు, నేను చదువుకొంటానులే" అన్నాడు సుబ్రహ్మణ్యం కాస్త విసుగ్గా—

సుశీలకి కాస్త చిరకోపం వచ్చిందేమో - ఆమె కిటికీవంక తిరిగిపోయింది; కొద్దిసేపటిలోనే ఆమెకు నిద్రపట్టిపోయింది.

సుబ్రహ్మణ్యం టేబిలువద్దర కుర్చీలో బుద్ధిగా కూర్చున్నాడేగాని, చదివినది అట్టేలేదు. అలా కొంతసేపు అతని కళ్లు పుస్తకంలోని మాటలను గమనించుకొంటూ సాగడమూ కొన్ని కాగితాలు తిరగడమూ జరిగిందిగాని, మనస్సుకుమాత్రం ఇదేమీ పట్టినట్లు లేదు - తన ఇనస్పెక్షను విజిటూ, అనకోకుండా వెంకటేశ్వర్లు ఇంట్లో మూడురోజు లుండిపోవడం, వాళ్ల అమ్మాయి సంగీతమూ, వాడిభార్య - ఆవిడ బలవంతంగా తనచేత మామూలుగా భోంచేసే కంటె ఎక్కువగా చేయించడమూ, వెంకటేశ్వర్లుకి ఎంతసేపూ తన పత్రికలూ, వ్యాసాలూ, తప్పితే ఊళ్లో రాజకీయాలూ వీటిలో ఉండే ఆసక్తిలో శతాంశమయినా స్కూలు విషయంలో లేకపోవడం, పోనీ తానున్న మూడురోజులలో ఒక్కరోజయినా నటనకోసమయినా స్కూలు నడిపితే తరవాత ఎలాగున్నా తన మనస్సుకి కొస్త తృప్తిగా ఉండును. అబ్బే ఆటువంటి ప్రయత్న లేశ మయినా లేదు. పైగా "ఓరే మణ్యం! చూసేవు కదూ, ఇక్కడ మనం చెప్పవలసింది పిల్లలకి కంటె పెద్దవాళ్లకే ఎక్కువ. మనం ఇక్కడ పిల్లలను ఎంతబలవంతంపెట్టి చదివించినా, ఈ లెక్కలూ ఈ పుస్తకాలలో మాటలు భట్టీయం వేయడం వీళకి సుతలామూ ఉపయోగించవు. ఏమంటే, రేపొద్దున్న ఈ నూడునాలుగేళ్లూ అయిపోయినతరవాత, వీళ్లు మళ్లీ వీళ తాతల తాతలనాటి పద్ధతులనే నిత్యజీవితంలోనూ వ్యవసాయంలోనూ అవలంబిస్తారు. గనుక ఇక్కడ మనం ఏంచెప్పినా పెద్దవాళ్లకే చెప్పవలసిఉంది. అదీ ఎంతవరకు వాళ్లకు నిత్యజీవితంలో బాగా ప్రయోజనం ఉంటుందో, అంత రకే చెప్పాలి గాని, మనలాగే అతిగాచదివి, కబుర్లకితప్ప మరెందుకు పనికిరానిమాటల పోగులుగా తయారు చెయ్యకూడదు అసలు మనం, ఏంచెప్పదలచినా, ఒక్కనాడు ఎక్కడనించో ఊడిపడ్డట్టు వచ్చి, ఏమేమో అంతా మారపోవాలని ఉపన్యాసాలు దంచి లాభంలేదు. ముందు మనం వాళ్లతో బాగా కలిసిపోవాలి. అప్పుడుగాని మనం ప్రయోజనకరమయిన సంస్కరణ ఏదీ చేయలేము........ ...ఇదీ వాడి ధోరణి ఒకమారు ఆరంభం అయితే అంతే, మరి అంతే కనబడదు. సరే, తన యిష్టం వచ్చిన అభిప్రాయాలు తన కుండవచ్చును. వాటిని పత్రికలలోనూ, ఉపన్యాసమూలంగానూ తన చిత్తంవచ్చినట్టు ప్రచారం చెయ్యవచ్చునుగాని స్కూలు అని చెప్పి గవర్నమెంటు గ్రాంటు తీసికొంటున్నప్పుడు, ఆపని ఒకమాదిరిగా అయినా సాగించకుండా ఉండడం ధర్మమా? తను ఆపనిలో ఉన్నాననటూ ఉండకపోతే, మరెవళ్ళో కేవలం అదంటేనే ఉత్సాహం ఉన్నవాళ్లు సిద్ధపడగలరూ పిల్లలూ బాగుపడుతారు...తనకు ఇష్టంలేక, అసలు ప్రధానోద్దేశాలలోనే భేదంఉంటూ, ఈ ఇచ్చేగ్రాంటు ఎలాగూ చాలదంటున్న మనిషి ఇది పూర్తిగా విడిచిపెట్టి తన పత్రికలూ ఉపన్యాసాలూ ఆ లోకంలోనే ఉండకూడదా? అలాఅయితే ఎవరికీ చిక్కులేదు. స్నేహం స్నేహమే అయితే ఉద్యోగధర్మం మాత్రం కక్కులకళ్లం లాంటిది కాదూ.. ?

* * *

సైకిలుమీద అతి తొందరగా ఊసలాగ వెళ్లిపోతున్న సుబ్రహ్మణ్యానికి అడ్డుగా మనిషి రావడం చాలా చికాకనిపించింది. క్లింగ్, క్లింగ్ క్లింగ్.. అబ్బే, తానెటుతిప్పితే అటే వచ్చేలాగున్నాడు హుఁ ఎవడీమనిషి, ఆఁ వెంకటేశ్వర్లే,ఎంతలా మారిపోయేడు-వింతవికారం, తనని బలవంతంగా నిలబెట్టి, తన చేతిలో సైకిలు లాక్కొని మురుగుకాలవలోకి తోసేసేడు మనిషితోపాటు గొంతుకకూడా మారిపోయింది. అంత శ్రావ్యంగాఉండే గొంతు సింహగర్జనమైపోయింది." ఏమిరోయి, నన్ను గుర్తుపట్టనే లేదా? పట్టినా, మాలాటివాళ్లతో మాట్లాడ్డానికి సైకిలు దిగితే పరువు తక్కువేం?"

సుబ్రహ్మణ్యానికి ఈ ప్రవర్తన చాలా అసహ్యంగా తోచి, ఏమీ మాట్లాడా లనిపించలేదు. అయినా నోరు అప్రయత్నంగానే తన పని తాను చేసేసింది. నువ్వు వెంకటేశ్వర్లువి కాదుట్రా, నీ కోపం వస్తే నామీద రావాలి గాని సైకిలుమీ దెందుకు నీపాదం చివరయినా మట్టలేదే?"-ఈ మాటలంటూనే అతని కన్నూ కాళ్లూ సైకిలువేపు తిరిగేయి—.

"ఇదుగో, ఒరేయి, ఆ సైకిలుగాని ఇప్పుడు తీసేవంటే చూసుకో, గ్రంథం చాలావరకూ వెళుంది. ఇక్కడీ నడిరోడ్డుమీ దెందుకు, ముందు కాఫీ హోటలుకి పద. ఊఁ, అనుమానిస్తావేం, మరేం నీ వెధవ హోదాకి తక్కువ రాదులే."

సుబ్రహ్మణ్యానికి భయంతో ఒళ్లంతా తేళ్లూ జెఱ్ఱులూ పాకినట్టయింది. వీడికి ఆమధ్యని పిచ్చెత్తిందని ఎవళ్ళోఅంటే తాను నమ్మలేదు. నిజమే కాబోలును. ఎలాగ తప్పించుకోవడం. ఆఁ, ఇదేసమయం, వాడటు చూస్తున్నాడు, మెల్లిగా సైకిలందుకుంటే ఎలాగయినా పారిపోవచ్చును.

అబ్బే పిచ్చి అని తెలివితేటలేం తగ్గినట్టులేదు. "ఒరేయి, నేను చూస్తూనే ఉన్నాను జాగర్త. ముందిలారాదూ" అని దండదగ్గర పట్టుకొని పరుగెత్తినంత తొందరగా లాక్కొనిపోతున్నాడు. హుఁ వీడి జోడుతగలడ ఎంత పెద్దదుందో, దాని కిందకాలు పడితే మరడగక్కరలేదు. ఒక కారుకంటె ఎక్కువ ధూళి రేగుతున్నది రోడ్డుమీద వీడు నడుస్తూఉంటే - నిజంగా పిచ్చే, ఈ ధూళిలో ఇలా ఈడ్వబడుతూ తాను ఎవళ్లకంటయినా పడితే పరువు ఏమయినా నిలుస్తుందా? అయినా ఈ ధూళిలో గుర్తించడమూ కష్టమే కావచ్చును. అబ్బ, ఎంతగట్టిగా నొక్కేస్తున్నాడు దండ - ఈ తొందర, ఈ బలం ఎలా వచ్చెనో, పిచ్చివాళ్లకి బలం ఎక్కువ ఉంటుందంటే తానిదివరకు నమ్మలేదు. గాని, నిజమే అనిపిస్తూంది

సుబ్రహ్మణ్యానికి భయంచేత కాళ్లు మరీ తొట్రుపడుతున్నాయి. నేరక చిక్కాను రా వీడి చేతికి, హాయిగా ఇంటికి వెళ్లి పెళ్లాం పిల్లల మొగం చూసే యోగ్యత ఉందోలేదో. వీణ్ణి కాదని నిలబడడానికి తనకి ఎలాగూ శక్తిలేదు, దారిలో ఏవచ్చువెధవయినా కనబడదేం సాయానికి ఊరికినే అరిస్తే అసలు ఇక్కడే తంతాడేమో.

అమ్మయ్య, ప్రాణాలు కుదుటపడ్డాయి; కాఫీక్లబ్బుకే తీసుకొనివచ్చేడు. ఇక నాకేం భయంలేదు. అకారణంగా పట్టుకొని తంతూ ఉంటే తక్కినవాళ్లు చూస్తూ ఊరుకోరు.

ఈ పరిస్థితిలో ఎవళ్లయినా తెలిసినవాళ్లు తారసపడతారేమో; ఎంత సిగ్గు! ఏమయినా మరి తప్పేదిలేదూ ఏమో వాడు చెయ్యివదిలీసి తనలో తానేదో పాడుకొంటూ ముందు నడుస్తున్నాడు. చల్లగా జారిపోడానికి ఇంతకన్న మంచి సమయంలేదు.

"ఏం, చల్లగా జారిపోవాలని చూస్తున్నావేమిటి? ముందు కాఫీ కానీ, అప్పుడు నీ గీర్వాణం వదలగొడతాను. "పద, ఊఁ, ఆమూలనున్న బల్లదగ్గరికి పద."

ఆహా, ఏమి కంఠధ్వని, చిన్నప్పుడు చిన్నయసూరిగారి మిత్రలాభంలో సంజీకుడనే ఎద్దు అరణ్యం అంతా మారుమోగిపోయేలాగ రంకె వేసిందని తాను చదివేడు. ఆ రంకెలాగుంది వీడి అరుపు - అయితే చిత్రం, ఒక్కడూ వినిపించుకోడేం, ఇంత హోటల్లోనూ, ఇందరికీ ఒక్కమారే చెవుడు వచ్చిందా? లేక వాడు మెల్లిగా మాట్లాడినా తనకి అలాగ వినిపిస్తున్నాదా?

అబ్బేలేదు, పిచ్చికూడా లేదు కాబోలు. సర్వగుతో ఎంత ఆప్యాయంగా అభిమానంగా మాట్లాడుతున్నాడో, కేవలం తనమీదనే పగ పట్టేడు కాబోలు.

తినకపోతే ఏమి ప్రమాదమో అని సుబ్రహ్మణ్యం తింటున్నాడేగాని, తన మనస్సంతా సైకిలుమీదే ఉంది ఇంతసేపు అక్కడే ఉంటుందా రోడ్డుప్రక్కని మురుగుకాలవలో. ఎవళ్లో ఈపాటికి సంగ్రహించి ఉంటారు. వీడంటూ వదిలితే, వెళ్లిచూసి అక్కడ లేకపోతే పోలీసుస్టేషనలో రిపోర్టు చెయ్యాలి. వీడినీ పాపం ఇలా విడిచిపెట్టి లాభంలేదు, ఎలాగో ఏర్పాటుచేసి పిచ్చివాళ్ల హాస్పిటలులో ప్రవేశపెట్టాలి పిచ్చిఅయినా కాకపోయినా తనకు మరి పూచీ ఉండదు.

(16-వ పేజీ చూడుడు)

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము. నిస్శక్త, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును కాంతిని వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. & కంపెనీ. పెరిదేపి-నెల్లూరు జిల్లా

బ్రాంచి : 7 సీను మొదలివీధి. మద్రాసు.



ఉద్యోగ ధర్మం

(11-వ పేజీ తరువాయి)

అబ్బ, నెత్తికొందర అలా అలా పెరిగి పోతూంది, అవి తీసే కుట్టువేధవలేదు కాబోలును. ఏమిటో వీడి సంగతి చూస్తే ఏమీ ఇంతలో తేలేలాగులేదు. ఇంకా ఇంకా తీసుకొని రావడానికి సర్వరుకి కూడా అనుమానంగానే ఉంది. పోనీ, కావలసినవాడు తాను తిని ఊరుకో రాదా - తనతో వచ్చినవాడుకూడా తనతో సమంగా తిని తీరాలట! ఇదేమి బలవంతపు బ్రాహ్మణార్థమో. నాలుగయిదు రోజులాయి తిండిలేదు కాబోలు. కాని, కొంపతీసి ఎక్కడయినా దొంగతనంచేసి రాలేదుకదా, సర్వరుతో "ఏం అనుమానిస్తావేం, డబ్బు కావలసినంత ఉందిలే" అంటున్నాడు.

సుబ్రహ్మణ్యం ఒక్కమారు కళ్ళు నలుపుకొని చూసేడు. ఇంతసేపూ తను కలకన్నాడు కాబోలు. తన ఆఫీసు, తనకుర్చీ, తన టేబిలు, అంతే - అంతా మామూలుగానే ఉంది. అదుగో వెంకటేశ్వర్లు. ఇందాకటి ఆ పిచ్చి ధోరణి ఏమీ ఉన్నట్టులేదే. ఎలావుంటుంది, తను కన్నది కలకదా. చేతులు కట్టుకొని వినయం మూర్తీభవించినట్లున్నాడు. ఇలాఉన్నా తన నిశ్చయం మాత్రం మార్చుకో కూడదు.

"అయ్యా, ఇక్కడ నాతో ఏమి చెప్పి ప్రయోజనం లేదు. నేను ముక్కుకి సూటిగా పోయే మనిషిని. గవర్నమెంటు డబ్బు తింటున్నందుకు నా ఉద్యోగధర్మం నేను నెరవేర్చకుండా ఉండలేను. స్నేహం, అభిమానం అవన్నీ ఇంటిదగ్గర - అంతేకాని, ఇక్కడ నా చేతులు కట్టేసి ఉన్నాయి."

ఎంతో గంభీరంగా తొట్రుపడకుండా మాట్లాడాలనుకున్నాడు తను. కాని, తనగొంతు తనకే ఎంతో లోతుగాఉన్న నూతిలోనుండి వచ్చే ధ్వనిలా వినిపించింది సుబ్రహ్మణ్యానికి.

ఏమిటి. మళ్ళీ ఇందాకటిలా తయారవుతున్నాడు వెంకటేశ్వర్లు. అయితే అదంతా నిజమే కాబోలు, తాను కల అనుకొన్నాడు. ఇదిగో, కాలవలోంచి సైకిలు తియ్యడంలో తన కాలు జారినప్పటి బురద - అలా చల్లగా ఇంటికి పారిపోకుండా ఏమో మించిపోయినట్లు ఆఫీసుకి తగలడడం తనదే పొరపాటు.

గట్టిగా పిలవడానికి గొంతుకూడా రాకుండా ఉంది. "రామస్వామి, రామస్వామి!" బజారుకి కూరలు తేవడానికి పోయేడు కాబోలు.

ఏమిటో అంటున్నాడు వెంకటేశ్వర్లు. చిత్రంగా ఉందే, వీడిగొంతుకూడా తన గొంతులాగే ఎంతో లోతునుండి వచ్చినట్టు వినిపిస్తున్నాది...

"తమరికి ఇప్పుడు కళ్లు నెత్తిమీద ఉన్నాయన్న సంగతి తెలిసి కూడా ఇక్కడికి రావడం పొరపాటేనండి చిత్తం, చిత్తం, తమరు ఎటు కదిలి ఫలితం లేదండి. రామస్వామి ఇక్కడెక్కడా లేడులెండి. అయ్యా బాబూ, తమరికి ఈ ఉద్యోగధర్మం, ఈనిజాయితీ ఇవన్నీ నేడే ఉద్భవించినట్లున్నాయండి. తమరు ఎప్పుడు ఏయే విధాలుగా ఎంతెంత లంచం డబ్బుగా గానీ, ఇతరవస్తు రూపేణగాని తీసుకొన్నది మరిచిపోయి ఉంటారండి. అదే తమకు కావలసిన పరమార్థమయితే, తమరు సెలవిప్పిస్తే అందుకు అభ్యంతరం ఉంటుందా అండి?"

సుబ్రహ్మణ్యానికి ఆగ్రహంతో ఒళ్లు మండికి పోయింది. ఈ ఏడెనిమిదేళ్ళలో తాను ఒక దమ్మిడీ అయినా లంచం పుచ్చుకోలేదే - అయితే ఏం ఫలితం, వాళ్లు నలుగురు కలిసి సాక్ష్యం పుట్టిస్తే సరి. తన ఉద్యోగం నీళ్లు కారిపోడానికి - ఊహుఁ మంచో చెడ్డో, తన మాటకి సందయినా ఇవ్వకుండా అలా ఏర్చుకొని పోతున్నాడు.

"తమ ప్రస్తుతపు నిజాయితీ యొక్క బరువువల్ల తమకు తమ పరీక్షకి కట్టడానికి దమ్మిడీకి గతిలేని సందర్భంలో, నేను ఎంత అవమానానికి అయినా సిద్ధపడి మామామయ్యజేబులోంచి యాభై రూపాయిలు దొంగతనంచేసి తెచ్చి ఇచ్చినసంగతిని జ్ఞాపకం చేస్తున్నందుకు మరోలా అనుకోకండి."

అబ్బబ్బ, ఏమిటీ మర్యాదా వాచకాలతో కూడినతిట్లు, ఇవి మరీ కర్ణకఠోరంగా ఉన్నాయి. ఇంతకంటె రెళ్లుమని లెంపకాయ కొట్టినట్లుగా తిట్టిన ఇందాకటిదే కొంతనయం. ఇంకా వదలడే.

"పరీక్షలముందు నా ఫస్టుక్లాసు సంగతి చూసుకోకుండా, ప్రేమకవిత్వంలో పడిన తమకు నా నోట్సులన్నీ నూరిపోసిన సంగతి తమకు విశదమే...

"చిత్తం చిత్తం చూడండి, తమరు పెళ్లిచూపులకి వెళ్లడానికి నేనదివరకు ఎంతో ముచ్చటపడి కుట్టించుకొన్న కొత్త సూటును ఒక్కమారయినా తొడగకుండా తమకు ఇయ్యడమూ తమరు తరువరిదానిని తిరుగా ఇప్పించే విషయం దఖలు పుచ్చుకోవడంసున్నూ తమకెరుకే గదా."

అన్నీ నిజమే కావచ్చును. కావాలంటే అన్నీ వడ్డీతో కలిపి తీర్చేస్తాను. అంతేగాని, ఈవిధంగా బలవంతపెట్టి నా ఉద్దేశానికి వ్యతిరేకంగా పనిచేయించాలని కాబోలు నీ ఉద్దేశం ...ఇలా ఏమేమో అనాలనుంది, గాని, గొంతులోంచి మాటే సరిగా రాదుకదా ఏమిటి, అలా చూస్తున్నాడు, వీడికిగాని చిల్లంగి భూతవైద్యము ఇటువంటివేమీ లేవుకదా!...

మళ్లీ ఉలుముతున్నాడు. ఓయిబాబో, ఈ మారు చేతిలో కఱ్ఱకూడా ఉంది.

"ఇప్పుడు నాకు ఆ వెధవ గ్రాంటుహక్కులంటూ ఒకటి లేకపోతే మరేం కొంప మునిగి పోతుందని కాదు. నా పాతస్నేహితుడొకడు, నాగురించి ఈవిధంగా అనడమా అనే నా ఉక్రోషం. అలా చూస్తున్నావేం, నాకు అనుకూలంగా రాస్తావా లేదా?"

దన్‌మని చప్పుడవడం మాత్రమే తనకు తెలిసింది, కఱ్ఱ తన బుఱ్ఱమీద పడిందో టేబిలు మీద పడిందో ఏమీ తెలియలేదు. బహుశః టేబిలుమీదే పడిఉంటుంది, తనకు నొప్పి ఏమీ కలగలేదు గనక.

"మళ్ళీ నెమ్మదిగా అడుగుతున్నాను. సవ్యంగా రాస్తావాలేదా?"

ఇప్పుడు మరి క్షేమంగా ఈ పరిస్థితిలోంచి తప్పించుకొండికి అలాగే రాస్తాననడంకంటె గత్యంతరంలేదు. తరవాత వీలునుబట్టి ఎలా కావలిస్తే అలా రంగు ఫిరాయించవచ్చును.

"చెప్పు వేగం."

చిత్తం చిత్తం, అలాగే రాస్తానండి." తన కిందిమనిషి దగ్గర తనకి చిత్తం చిత్తం అన్న గౌరవవాచకం ఎలా వచ్చిందో. పోనీ అదీ మంచిదే. కొంత శాంతించినట్లున్నాడు.

"జేబులో కలంలేదు. తరవాత రాస్తాను. అనాలిగాని అన్నతరవాతమాత్రం ఈ సుబ్రహ్మణ్యం మాట తప్పేవాడు కాడు."

"ఆహాఁ ఏమీ చలాకీతనం-ఇటువంటి గమ్మత్తులు చాలా చూసేను. నా దగ్గర కలం ఉంది. రాయి ఏం? ఇలా నెమ్మదిగా చెప్తే బుర్రెవచ్చేలాగ లేదు."

... ...

డబ్‌మని టేబిలు మీదఅయిన శబ్దంతో సుశీలకి తెలివి వచ్చింది. పిల్లి ఏదో టేబిలుమీద గెంతింది కాబోలనుకొంది. నయమే, లైటుపడిపోలేదు.

ఇదేమిటే, పాపం, ఆయన అలా టేబిలు మీదే తలపెట్టుకొని పడుకొన్నారు. ఎంత సేపయిందో.

ఏమిటిది, అలావణికిపోతున్నారు. ఏదో కలకన్నారు కాబోలు.

తొందరగావెళ్లి, చేతులుపట్టుకొని, నిలబెట్టి, గట్టిగా పట్టుకొని, జాగ్రత్తగా నడిపించుకొనివచ్చి మంచంమీద పడుకోబెట్టి అడిగింది.

"ఏమండీ, తెలివివచ్చిందా, ఏమిటలావణికి పోయేరు, ఏదో టేబిలుమీద చప్పుడయితే నాకు తెలివి వచ్చింది."

"చప్పుడు నీకూ వినిపించిందికదూ, ఎందుకూ ఆలస్యం, లేకాగితం కలం తే, రాసేస్తాను. అక్కడితో వదిలిపోతుంది వెధవబాధ."

"ఏమిటండీ, ఇంకా కలే, చూడండి, నేను సుశీలని - అబ్బ, అందికే అంటాను, అంతమరీ నిద్ర ముంచుకు వచ్చేదాకా చదవకుండా హాయిగా పదిన్నర అయ్యీ సరికల్లా పడుకోండి అని. బాగా తెలివివచ్చిందా?"

"ఆఁ ఆఁ, ఏమీలేదులే, చెయ్యే కొంచెం నొప్పెడుతూంది"

"అయితే నిద్రలో మీరే టేబిలుమీద చేతితో కొట్టేరు కాబోలు. నే నింకా పిల్లో ఏదో గెంతిం దనుకొన్నాను. నయమే, టేబిలు కాబట్టి మీ చేతి నొప్పితో సరిపోయింది, అంత దెబ్బ నామీద పడి ఉంటే ఏమయేదాన్నో."

"నువ్వు పక్కనుంటే అసలు కలే రాకపోవునేమో."

"మంచికలే. ఏమిటి కలం కాగితం తెమ్మంటున్నారూ రాస్తానని?"

"అదంతా చాలా ఉందిలే, ప్రొద్దున్న చెప్తాను."

"అలాగేలెండి, పీడకల వచ్చిం తరవాత ఆమాట మరిచిపోయి పడుకోవడం మంచిదంటారు. మంచి నీళ్ళిమ్మన్నారా?

"ఇయ్యి, అసలుఈ రాత్రి మంచి నీళ్ళు త్రాగకుండా అలాచదువుతూ పడుకోవడమే కారణం. పన్నెండు కొట్టడం జ్ఞాపకం ఉంది. తరవాత మరి ఇప్పుడు ఒంటిగంటన్నర కనూ అయింది. ఈగంటన్న రాకపో నన్నమాట."

"ఇందండి మంచినీళ్లు. మరేమీ మంచీ చెడ్డా ఆలోచించకుండా పడుకోండి; దానంతటదే నిద్రవస్తుంది."

"అలా మరి లాభంలేదు. నువ్వు ఏదయినా పాటపాడు."

"ఇప్పుడు పాటా? నాతరం కాదు బాబూ, ఎవరేయినా వింటే ఏమనుకొంటారు? కావాలంటే బాగా నిద్రవచ్చేదాకా."

"వద్దు లెద్దూ పాపం, పగలంతా ఏదో పని చేసి అలిసిపోయి, ఉంటావు పాడనన్నావు, పోనీ ఏదయినా కథ చెప్పు, అలా వింటూ పడుకొంటాను."

"అలాగేమరి కదలకుండా పడుకోండి..."

* * *

ఉదయం కాఫీ తాగుతూ ఉండగా సుశీల మళ్లీ ప్రసంగం తెచ్చింది. "అయితే మరి మీ స్నేహితుడుగారి స్కూలుసంగతి ఏమిటి రాయదలుచుకొన్నారు?"

"అదే, ఆలోచిస్తున్నాను. వాడూ పాపం పిల్లలవాడు. అట్టే ఆస్తి ఇప్పుడేంలేదు. పైగా నువ్వు చెప్పినట్లు ఇద్దరం కలిసి చదువుకొన్నాము. ఎంతో స్నేహంగా ఉండేవాళ్లం, వాడికి అపకుపాయం నా చేతులారా చెయ్యడమా అని."

"మరి మీ ఉద్యోగధర్మమో? లేక రాత్రిగారి కలలో కనిపించి, ఏమయినా కట్నం ముట్టచెప్తానన్నారేమిటి? ఒక్కమారుగా ఇలా మారిపోయేరు.

"నీకు ఇదంతా నవ్వులాటగా ఉన్నట్టుంది. నువ్వే సరిగ్గా నా స్థితిలో ఉంటే తెలిసివచ్చేది."

"ఎవళ్లూ పైవాళ్లున్న స్థితిలో ఉండేది లేదు, ఊహించాలిగాని, సరే నాకెందుకు మీ ఉద్యోగపు సంగతులు నిన్న నేవో ఉత్తరాలు వచ్చేయి. చూసేరా, డ్రాయర్లో ఉన్నాయి."

"నాకు తెలియదే, చెప్పేవు కాదేం."

"ఏమో మీరు మామూలుగా చూస్తారు, లేదా నన్నడుగుతారనుకొన్నాను. వాటిలో మీ వెంకటేశ్వర్లుగారి దగ్గరనుండి వచ్చినది ఒకటికూడా ఉన్నట్టుంది."

"వాడిదగ్గరనుంచా, ఏమిటి రాస్తాడు, ఏదో ఈ ఘోషే అయిఉంటుంది. నువ్వు చదవలేదూ?"

"నాకెందుకూ మీ ఉత్తరాలు, మీరే చదువుకోండి."

ఒకమారు చదివి నమ్మకం తోచక మళ్లీ చదివేడు సుబ్రహ్మణ్యం. సుశీలదగ్గరకి వంటింట్లోకే వెళ్లి - "ఎంత గమ్మత్తుచేసేవు. రాత్రి నన్ను అంతలా చిక్కు పెట్టకపోతే అప్పుడే చెప్పేకూడదూ, నువ్వు కావాలనే గమ్మత్తు చేసి ఉంటావు."

సుశీల సాధ్యమయినంత గంభీరంగా మొగం పెట్టి అంది - "నాకేమీ తెలీదండీ, ఏమిటుందేమిటి?"

"వాళ్ల స్నేహితుడొకడికి తండ్రి చచ్చిపోడంతో ఆస్తి చేతికి వచ్చిందట. అతడిప్పుడొక మంచిపత్రిక మద్రాసులో పెడుతున్నాడట - దానికి సంపాదకత్వం వహించమని వీడికి రాసేడట. మొదట అక్కడ ఇల్లూ అదీ అంతా కుదిరేవరకూ వాళ్ల కుటుంబాన్ని ఇక్కడే ఉంచుతాడట. ఏదయినా ఇల్లు మనింటికి దగ్గరగా చూడమన్నాడు."

"అలాగా, అయితే స్కూలుమాట మరేం రాయలేదూ!

"స్కూలు అన్న ఈ పద్ధతి తనకి ఇష్టంలేక పోయినప్పటికీ, ఏదో అక్షరజ్ఞానం కలిగించవలసిన బాధ్యత ఉంది కాబట్టి, ఎవరయినా బాగా ఓపికవుండగలిగిన కుఱ్ఱాణ్ణి పంపమన్నాడు ఆ మాష్టరు సదుపాయానికి ఊళ్లోవాళ్లతో తానన్ని ఏర్పాట్లూ చేసేడట."

"వెళ్లిపోతూ వెళ్లిపోతూ ఆయనకెందుకో స్కూలుసంగతి, అత్తా నీకొడుకు ఆకలికూటివాడన్నట్టు తా ననన్నంతకాలం ఆస్కూలు అలా పాడుగా ఉండి, పాపం నిన్న రాత్రంతా మీకు ఒకవంక ఉద్యోగధర్మం ఇంకొకవంక స్నేహబంధం పట్టుకొని పీడించేయికదా!"

"అదిగో నవ్వుతున్నావు నువ్వు కావాలనే గమ్మత్తుచేసేవు. రోజూ టేబిలుమీదే ఉంచేదానివి నిన్న ఉత్తరాలు డ్రాయర్లో ఉంచడం దేనికి, నన్ను తమాషా చేద్దామనే."

"అలాటి పెద్దఉద్దేశం లేదు. మొదట నేనూ మరిచిపోయేను. ఈ వనక ఆ ప్రసంగం వచ్చిన తరవాత, ఈ ఉత్తరం అందకపోతే మీ మనస్సెలా మొగ్గుతుందో చూద్దామనిపించి ఊరుకొన్నాను."

"మంచిపని చేసేవు. రాత్రంతా నా నిద్ర తగలడింది. దీని మూలంగానే."

"అయితే ఇదేనేమిటి. రాత్రి ఆకలకూడాను. నేను ఏదో పీడకల వచ్చింది కాబోలనుకొన్నాను. ఏమిటి వచ్చిందేమిటి?"

"కలమాట కేమిలే, ఇవాళ మరేమీ ఆఫీసు పని చెయ్యాలనిలేదు. ఒక్కమారు అలా ఆఫీసుకి వెళ్లివచ్చేస్తాను. వెధవపని ఎప్పుడూ ఉన్నదే కదూ."

"అయితే ఏమిటి, వాళ్లు ఈఊరు వస్తామనా రాసేరు?"

"ఇంకా గమ్మత్తు చేస్తున్నావా, ఉత్తరం చూడనట్టు. మొన్నటికే అందవలసిన ఉత్తరం నిన్న సాయంత్రం అందింది. ఈ రాత్రికే వచ్చేస్తారు. నేను స్టేషనుకి వెళ్లాలి."

"ఈ రాత్రికేనా? ఎందరు?"

"వాళ్లు భార్యాభర్తలు ఇద్దరూ, ముగ్గురు పిల్లలున్నూ అంటే చిన్నపిల్ల రెండేళ్లది. అవసరం ఉంటుందేమో, పాలు ఉంచు అయినా వాడు అక్కడ ఇల్లు చూసుకొనే లోపున ఒక పదిహేను ఇరవైరోజులకి వేరే ఇల్లు చూసుకోడం ఎందుకు? మనింట్లోనే ఉంటే?"

"అసలు మీకు ఉత్తరం రాయడంలో ఆయన ఉద్దేశం అదే కాబోలు."

"అయితే నేంలే, నేను నా చదువుకొనే రోజుల్లో ఒకసంవత్సరం వాళ్లింట్లో ఉన్నాను"

"సరే మీ యిష్టం."

"అంటే, నీకిష్టం లేదా?"

"నేనలా అన్నానా? నే ననవలసిన మాట మీరే అన్నారకదా అని సరే అన్నాను. ఈ రాత్రికే వస్తారన్నమాట."

"అవును, ఏమయినా బజారునుంచి కావలసినవి ఉంటే చీటీరాసి రామస్వామి చేత పంపించు."



రిస్‌వాచ్ రు 13/- మాత్రమే స్విస్ మేడ్. 5 సంవత్సరాలు గ్యారంటి క్రోమియమ్ కేస్ 4 జువెల్స్. రౌండ్‌షేప్ రు 13/- శ్రేష్ఠమైనది రు 14/- సెంటర్ సెకండ్ రు 15/- రెక్టాంగ్యులర్ షేప్ క్రోమియమ్‌కేస్ 6జువెల్స్ రు 20 శ్రేష్ఠమైనది రు 22/- 10సం. గ్యారంటీ రోల్డుగోల్డు 7 జ్యువెల్స్ రు 27/- శ్రేష్ఠమైనది. రు 29/- రౌండ్ క్రోమియం ఫ్లాట్ షేప్ 15 జువెల్స్ రు 32/- శ్రేష్ఠమైనది రు 34/- పాకెట్ వాచ్ రు 11/- అలారమ్ టైమ్ పీస్ రు 14/- శ్రేష్ఠమైనది రు15/- ప్యాకింగ్‌పోస్టేజి 14 అణాలు.

FRENCH COMMERCIAL STORE, W P-
POST BOX NO. 12216, CALCUTTA-5